


sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే



హైదరాబాద్ | 08-10-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 166 EDITOR: ROHINI

హైదరాబాద్‌ను ఏలుతున్న క్రికెట్ కింగ్స్

ధోనీ నుంచి కోహ్లీ వరకు బిజినెస్‌ల జోరు





- క్యాచ్‌లు ఆపేసి.. క్యాష్ కొల్లగొడుతున్నారు
- రెస్టారెంట్లు, పాడెల్ కోర్టులతో కోట్ల వ్యాపారం
- స్పోర్ట్స్ అండ్ లైఫ్‌స్టైల్ హబ్‌గా భాగ్యనగరం

క్యాచ్‌లు పట్టడం ఆపేసి.. క్యాష్ సంపాదించే కొత్త బిజినెస్‌లలోకి మన స్టార్ క్రికెటర్లు దిగుతున్నారంటే నమ్ముతారా? అవును, దేశంలో ఇన్ని పెద్ద మెట్రో నగరాలు ఉండగా మన స్టార్లందరికీ ఇప్పుడు హైదరాబాద్ నగరమే హాట్ ఫేవరెట్‌గా మారిపోయింది. ధోనీ, కోహ్లీ, సిరాజ్, రాయుడు... ఇలా ఒకరి తర్వాత ఒకరు హైదరాబాద్‌ను తమ బిజినెస్ హబ్‌గా మార్చేస్తున్నారు. అసలు వీరంతా హైదరాబాద్ వైపే ఎందుకు క్యూ కడుతున్నారు? ఏ క్రికెటర్ ఎలాంటి బిజినెస్ మొదలుపెట్టారో తెలుసుకోవాలని ఉందా? అదేందో తెలుసుకుందాం పదండి. - సహనం వందే, హైదరాబాద్

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఇటీవల జూబ్లీహిల్స్‌లో 7పాడెల్ ఎంఎస్ పేరిట ఒక భారీ స్పోర్ట్స్, వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభించారు. సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్ట్‌లో కేవలం పాడెల్ కోర్టులు మాత్రమే కాకుండా జిమ్, ఐస్‌బాత్, యోగా స్టూడియో, కేఫ్ వంటి అనేక ఆధునిక వసతులు ఉన్నాయి. పాడెల్ పార్క్ ఇండియా భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఈ సెంటర్ క్రీడలతో పాటు సోషల్ స్పేస్‌ను అందిస్తోంది. ప్రస్తుతం దేశంలో 1.25 లక్షలకు పైగా యాక్టివ్ పాడెల్ ప్లేయర్లు ఉన్న తరుణంలో ధోనీ ఈ విభాగంలోకి అడుగుపెట్టడం విశేషం.

కోహ్లీ లైఫ్‌స్టైల్ డైనింగ్ దందా

మరోవైపు పరుగుల మాంత్రికుడు విరాట్ కోహ్లీ కూడా హైదరాబాద్ బిజినెస్ మార్కెట్‌లో తన ముద్ర వేశారు. హైటెక్ సిటీలోని సత్వ నాలెడ్జ్ సిటీలో వన్8 కమ్యూన్ పేరిట ప్రీమియం రెస్టారెంట్, లైఫ్‌స్టైల్ డైనింగ్ స్పేస్‌ను కోహ్లీ ప్రారంభించారు. ఇది సాధారణ హోటల్‌లా కాకుండా యువతను ఆకట్టుకునే నయా కల్చర్‌ను నగరానికి పరిచయం చేసింది. రెస్టారెంట్ వ్యాపారంతో పాటు వ్రాంగ్, వన్8 బ్రాండ్లలోనూ, బ్లూ ట్రైబ్, రేజ్ కాఫీ, డిజిట్ ఇన్సూరెన్స్ వంటి పలు స్టార్టప్‌లలోనూ కోహ్లీ భారీగా పెట్టుబడులు పెట్టారు.

లోకల్ బాయ్ సిరాజ్ జోరు

హైదరాబాద్ లోకల్ బాయ్, స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ తన సొంత నగరంలోనే హోటల్ రంగాన్ని ఎంచుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో జోహార్ఫా టేస్ట్ అబవ్ ది రెస్ట్ పేరిట సొంతంగా రెస్టారెంట్ ప్రారంభించి సత్తా చాటుతున్నారు. నగరంతో ఉన్న తన వ్యక్తిగత అనుబంధాన్ని బ్రాండ్‌గా మార్చుకుని సక్సెస్ ఫుల్ వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. సిరాజ్ హోటల్‌కు స్థానికుల నుంచి, క్రికెట్ అభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

రాయుడు, లక్ష్మణ్ మాస్టర్ ప్లాన్

తెలుగు తేజం, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు సైతం హైదరాబాద్‌లోనే తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. సైనిక్‌పురి ప్రాంతంలో బ్యారక్స్ అండ్ యాంటీరూమ్ పేరుతో మల్టీ లెవెల్ డైనింగ్, సోషల్ స్పేస్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చారు. క్రికెటర్లు తమ బ్రాండ్ వాల్యూను, ఫ్యాన్ బేస్‌ను ఆఫ్ ఫీల్డ్ వ్యాపారాలకు ఎలా ఉపయోగించుకోవచ్చో రాయుడు నిరూపిస్తున్నారు. కేవలం రెస్టారెంట్లు, ఫిట్‌నెస్ సెంటర్లకే పరిమితం కాకుండా క్రీడా శిక్షణను వ్యాపారంగా మలిచారు వీవీఎస్ లక్ష్మణ్. హైదరాబాద్ సమీపంలోని మొయినాబాద్ శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో వీవీఎస్ స్పోర్ట్స్ అకాడమీని ఆయన నడుపుతున్నారు. భావి తరాల క్రికెటర్లకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇస్తూ స్పోర్ట్స్ అకాడమీ విభాగంలో సక్సెస్ కాంబినేషన్‌గా నిలిచారు.

సచిన్ సంచలన ఇంజినీరింగ్ పెట్టుబడులు...

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ హైదరాబాద్‌కు చెందిన ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగానికి కావాల్సిన ఇంజినీరింగ్ భాగాలను ఈ సంస్థ తయారు చేస్తుంది. కంపెనీ ఐపీఓకు వెళ్లకముందే సచిన్ ఇందులో వాటాలు కొనుగోలు చేయడంతో ఆయన పెట్టుబడి విలువ భారీగా పెరిగింది. సచిన్‌తో పాటు పీవీ సింధు, సైనా నెహ్వాల్, వీవీఎస్ లక్ష్మణ్ కూడా ఈ సంస్థలో పెట్టుబడిదారులుగా ఉండటం విశేషం.

హైదరాబాద్‌లోనే ఎందుకు?

అసలు వీరంతా దేశంలోని ఇతర నగరాలను కాదని హైదరాబాద్ వైపే ఎందుకు మొగ్గు చూపుతున్నారో తెలుసా? హైదరాబాద్ నగరంలో ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్ రంగాలు ఊహించని రీతిలో విస్తరిస్తున్నాయి. భారీ సంఖ్యలో ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్, పెరిగిన తలసరి ఆదాయం కొత్త వ్యాపార నమూనాలకు బలమైన మార్కెట్‌ను సృష్టిస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్ స్వయంగా ఒక అతిపెద్ద క్రికెట్ మార్కెట్. ఐపీఎల్ మ్యాచ్‌లు, అంతర్జాతీయ పోరులు, లోకల్ టాలెంట్ కలగలిసి క్రీడాకారుల బ్రాండ్ ఇమేజ్‌కు ఇక్కడ అత్యంత అనుకూలమైన వాతావరణం లభిస్తోంది.

నడిరోడ్డుపై నగ్నంగా ట్రంప్

యూరోపియన్ పార్లమెంట్ వద్ద ప్రత్యక్షం

- అంతర్జాతీయ స్థాయిలో దుమారం
- అమెరికా విదేశాంగ విధానంపై వ్యతిరేకత
- డెన్మార్క్ కళాకారుడు గాల్సియోట్ రచ్చ
- షాకింగ్ పంచ్... అహంకారానికి నగ్న రూపం!

ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బోర్గ్‌లో ఉన్న యూరోపియన్ పార్లమెంట్ భవనం సమీపంలో ఐరోపా ప్రజల దృష్టిని ఆకర్షించేలా ఒక భారీ విగ్రహం దర్శనమిచ్చింది. సుమారు ఎనిమిది అడుగుల పాడవు ఉన్న ఈ విగ్రహం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉంది. విశేషం ఏమిటంటే ఈ విగ్రహంపై దుస్తులు లేకుండా మేలిమి బంగారు పూతతో తయారు చేశారు. ది ఆరంజ్ ప్లేగ్ అనే పేరుతో పిలుస్తున్న ఈ విగ్రహం ప్రస్తుతం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. - సహనం వందే, ఫ్రాన్స్



ఈ విగ్రహాన్ని జాగ్రత్తగా గమనిస్తే అందులో ఒక బలమైన సామాజిక సంకేతం కనిపిస్తుంది. విగ్రహంలో ఉన్న ట్రంప్ ఒక చేతిలో గోల్ఫ్ స్టిక్, మరో చేతిలో న్యాయానికి సంకేతమైన త్రాసును పట్టుకుని ఉంటారు. ఇద్దరూ సమానంగా ఉండాల్సిన న్యాయాన్ని... ఒక వైపు వినోదాన్ని చూపిస్తూనే ఆ విగ్రహం కింద ఒక సన్నటి, తీవ్ర అలసటకు గురైన వ్యక్తిపై ట్రంప్ కూర్చున్నట్లు చెక్కారు. ఆయన కిందే ప్రపంచ పటం ఆకారంలో ఉన్న ఒక బంతి కూడా ఉంటుంది.

'ది కింగ్ ఆఫ్ ఇన్ జస్టిస్' వ్యాఖ్యానం

ఈ విగ్రహం కింద భాగంలో ది కింగ్ ఆఫ్ ఇన్‌జస్టిస్ అనే పేరు పెట్టారు. అలాగే 'నేను ఒక వ్యక్తి వీపుపై కూర్చున్నాను, నా బరువు కింద అతను నలిగిపోతున్నాడు, అతనికి సాయం చేయడానికి నేను ఏమైనా చేస్తాను కానీ ఆయన వీపు మీద నుంచి మాత్రం కిందకు దిగను' అనే వ్యంగ్యాత్మక వ్యాఖ్యానాన్ని కూడా దీనిపై పొందుపరిచారు.

డానిష్ కళాకారుడు జెన్స్ గాల్సియోట్ నిరసన

ఈ వివాదాస్పద శిల్పాన్ని డెన్మార్క్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు జెన్స్ గాల్సియోట్ రూపొందించారు. అమెరికా అనుసరిస్తున్న విదేశాంగ విధానాలు, పర్యావరణ మార్పులపై వారికున్న వైఖరిని నిరసిస్తూనే ఈ విగ్రహాన్ని తయారు చేశానని ఆయన చెప్పారు. ప్రపంచ నియమ నిబంధనలకు, ప్రజాస్వామ్య విలువలకే కాకుండా వాతావరణ మార్పులను అరికట్టే ప్రయత్నాలకు ట్రంప్ విధానాలు ముప్పుగా మారాయని ఆయన ఆరోపించారు.

కళాకారుడి ఇతర ప్రసిద్ధ శిల్పాలు

జెన్స్ గాల్సియోట్ రాజకీయ అంశాలను తన కళ ద్వారా సమాజానికి చూపించడంలో సిద్ధహస్తుడు. గతంలో హాంకాంగ్‌ను చైనాకు అప్పగించే సమయంలో, 1989 నాటి తియానన్మెన్ స్క్వేర్ నిరసనలకు మద్దతుగా పిల్లర్ ఆఫ్ షేమ్ పేరుతో ఎనిమిది మీటర్ల ఎత్తున్న మానవ శరీరాల విగ్రహాన్ని తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. అలాగే ఆయన రూపొందించిన సర్వైవల్ ఆఫ్ ది ఫ్యాటెస్ట్ అనే కళారూపం కూడా ఎంతో ప్రాచుర్యం పొందింది. ఆ శిల్పంలో ఆకలితో అస్థిపంజరంలా ఉన్న ఒక చిన్న బాలుడు, ఊబకాయంతో ఉన్న ఒక పెద్ద మహిళను మోస్తున్నట్లుగా ఉంటుంది. ప్రపంచంలో ఆర్థిక అసమానతలను, ధనిక దేశాలు పేద దేశాలను పిప్పి చేస్తున్న తీరును ఆ విగ్రహం ద్వారా చూపించారు. ఇప్పుడు ట్రంప్ విగ్రహం కూడా అదే శైలిలో రూపుదిద్దుకుంది.

ఐరోపా రాజకీయ వర్గాల స్పందన

ఈ విగ్రహ ఏర్పాటుపై ఐరోపా రాజకీయ వర్గాల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డెన్మార్క్ పార్లమెంట్ సభ్యుడు పెర్ క్లాసెన్ ఈ ప్రదర్శనను స్వాగతించారు. శిల్పాలను, విమర్శలను కూడా తట్టుకోలేనంత బలహీనమైన మనస్తత్వం ఉన్నవారు ప్రపంచ వేదికపై నాయకులుగా ఉండటానికి అర్హులు కారని ఆయన వ్యాఖ్యానించారు. కళా రూపంలో వచ్చే నిరసనలను ప్రజాస్వామ్యంలో ఆమోదించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

మహిళల ప్రయాణం నిత్య పోరాటం

బస్సు, రైళ్లు, నడకనే ఆశ్రయిస్తున్న స్త్రీలు

- పని ప్రదేశాలకు వెళ్లాలంటే నరకయాతన
- 67 శాతం మంది మహిళల పరిస్థితి ఇదే
- నేషనల్ హౌస్‌హోల్డ్ ట్రావెల్ సర్వే రిపోర్ట్

ప్రతిరోజూ పొద్దున్నే లేచి ఆఫీసుకో, పనికో వెళ్లేటప్పుడు మీరు ఎలా వెళ్తారు? హాయిగా బైక్ తీసి సెల్ఫ్ స్టార్ట్ కొడతారా? లేదంటే కార్లో ఏసీ వేసుకుని వెళ్తారా? కానీ మన మహిళలు ఎలా వెళ్తున్నారో ఎప్పుడైనా గమనించారా? ఆటోల కోసం ఎదురు చూడడం, బస్సుల కోసం కిలోమీటర్ల కొద్దీ నడవడం, లేదంటే కిక్కిరిసిన లోకల్ ట్రెయిన్లలో ప్రయాణించడం! మన దేశంలో మహిళలు పని ప్రదేశాలకు ఎలా వెళ్తున్నారు, వారి ప్రయాణ పద్ధతులు ఎలా ఉన్నాయనే దానిపై ఒక సంచలన సర్వే బయటపడింది. - సహనం వందే, హైదరాబాద్



భారతదేశంలో ప్రజలు పని ప్రదేశాలకు చేరుకోవడానికి ఎలాంటి రవాణా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారో తెలుసుకోవడానికి నేషనల్ హౌస్‌హోల్డ్ ట్రావెల్ సర్వే ఒక సమగ్రమైన అధ్యయనాన్ని చేపట్టింది. ఈ సర్వేలో తేలిన గణాంకాలు పురుషులు, మహిళల మధ్య ప్రయాణ సాధనాల ఎంపికలో ఉన్న భారీ వ్యత్యాసాన్ని స్పష్టంగా ఎత్తిచూపాయి. మన దేశంలో లింగభేదం అనేది కేవలం ఉద్యోగాలు, వేతనాల్లోనే కాదు చివరికి ఆఫీసుకు వెళ్లే ప్రయాణాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాడకంలో మహిళలే ముందు వరుసలో ఉన్నారని ఈ సర్వే ఆధారాలతో సహా నిరూపిస్తోంది.

మహిళలకు ప్రజా రవాణానే దిక్కు..

పురుషులతో పోలిస్తే మహిళలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగిస్తున్న శాతం దాదాపు రెట్టింపుగా ఉంది. బస్సులు, లోకల్ రైళ్ల వంటి ప్రజా రవాణా లేదా నడక ద్వారానే 67 శాతం మంది మహిళలు తమ పని ప్రదేశాలకు చేరుకుంటున్నారు. ఇది మన సమాజంలో మహిళల ఆర్థిక, రవాణా స్వాతంత్ర్యం ఏ స్థాయిలో ఉందో తెలిపే ఒక సూచిక.

ప్రయాణ సమయం... శారీరక శ్రమ

సొంతంగా బైకో, కారో ఉంటే కోరుకున్న సమయానికి ఆఫీసుకు చేరుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ ప్రజా రవాణాపై ఆధారపడినప్పుడు గంటల తరబడి బస్టాండ్లలో వేచి చూడటం తప్ప మరొక మార్గం ఉండదు. రోజువారీ ప్రయాణంలో మహిళలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు సమయం వృధా కావడం, శారీరక శ్రమ పెరగడం. వేకువజామునే లేచి ఇంట్లోని పనులన్నీ పూర్తి చేసుకుని, ఆ తర్వాత కిక్కిరిసిన బస్సుల్లో నిలబడి ప్రయాణించడం వారిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సొంత వాహనం కొనుగోలు చేసే వెసులుబాటు లేకపోవడం లేదా కుటుంబంలో ఉన్న వాహనాన్ని పురుషులే ఉపయోగించడం వల్ల మహిళలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు పరిమితమవుతున్నారు.

కాలినడకన ప్రయాణం... భద్రతా సవాళ్లు

మరోవైపు నడుస్తూ ఆఫీసులకు వెళ్లే మహిళల సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉందని ఈ నివేదిక చెబుతోంది. కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్లడం ఆరోగ్యానికి మంచిదే అయినా, పని ప్రదేశాలకు వెళ్లే తొందరలో ప్రతిరోజూ ఇలా చేయడం చాలా కష్టమైన విషయం. మౌలిక సదుపాయాలు సరిగా లేని రోడ్లు, ఫుట్‌పాత్‌లు లేని వీధుల గుండా నడవడం మహిళల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

పురుషుల ప్రయాణ సరళితో పోలిస్తే...

పురుషుల విషయానికి వస్తే వారి ప్రయాణ సరళి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. పురుషుల్లో మెజారిటీ సొంత టూ వీలర్లు లేదా ఫోర్ వీలర్లను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల వారి ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా శారీరక అలసట కూడా చాలా వరకు తగ్గుతుంది. కానీ మహిళలకు ఆ స్థాయి సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల వారు ప్రయాణానికే ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది.

సురక్షితమైన ప్రయాణం... ప్రభుత్వాల బాధ్యత

ఈ సర్వే ఆధారంగా మనం ఆలోచించాల్సిన మరో ముఖ్యమైన కోణం సురక్షితమైన ప్రయాణం. ప్రభుత్వాలు వారికి తగిన భద్రతను అందించాల్సిన బాధ్యత ఉంది. రాత్రి వేళల్లో సరిపడా వీధి దీపాలు లేకపోవడం, బస్సుల్లో రద్దీని ఆసరాగా చేసుకుని జరిగే వేధింపులు మహిళల ప్రయాణాన్ని మరింత నరకప్రాయంగా మారుస్తున్నాయి. రవాణా వ్యవస్థలు సురక్షితంగా లేకపోతే మహిళలు ఉద్యోగం మానేసే ప్రమాదం ఉంది. అందువల్ల మహిళల కోసం ప్రత్యేక బస్సులు, మెరుగైన రవాణా వసతులు కల్పించడం తక్షణ అవసరంగా మారింది.